ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

గురువారం 16 మే 2024

'అభయహస్తం' డబ్బులు వాపస్ వచ్చేదెన్నడు..? 8లో..

ముందస్తు జాగ్రత్తలతోనే డెంగ్యూ నివారణ 8లో..

పుస్తకాలు వచ్చేశాయ్..!

- పాఠశాలల ప్రారంభానికి అందించేలా ఏర్పాట్లు
- బరువు తగ్గించి ముద్రణ
- నోట్ బుక్కులు...వర్క్ బుక్కులు సైతం
- గోదాముల్లో నిల్వ



జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థుల చేతికి పాఠ్యపుస్తకాలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఇప్పటికే కాంగ్రెస్ సర్కారు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే వరకు కనీస మౌలిక వసతుల కల్పనకు ఏర్పాటు చేస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ వంటి చిన్న చిన్న మరమ్మతులు చేపడుతున్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు సకాలంలో అందించేందుకు ఇప్పటికే పిల్లల దుస్తుల కొలతలు తీసుకున్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, వర్క్ బుక్కులు పాఠశాలల ప్రారంభం నాటికి పంపిణీ చేసేందుకు ముందస్తు కసరత్తులు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాకు ఎంత మేర అవసర మవుతాయో ఇప్పటికే విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. వాటిని దశ వారిగా రాష్ట్ర అధికారులు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి విడత పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి.

జిల్లాలో కావాల్సినవి ఇలా...

జిల్లా వ్యాప్తంగా యూడైస్ ఆధారంగా ఒక్కో విద్యార్థికి తరగతిని బట్టి 5 నుంచి 11 పుస్తకాలు అవసర మవుతాయి. 2022-23 యూడైస్ ప్రకారం జిల్లాలో 853 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలుండగా 85, 368 మంది విద్యార్థులున్నారు. వీరందరికి కలిపి సుమారు 3,85,420 పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయన్న అంచనాతో జిల్లా విద్యాశాఖాధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ పంపారు. రాష్ట్ర స్థాయిలో పుస్తకాల ముద్రణ పూర్తి కాకపోవడంతో జిల్లాకు ఇంకా పుస్తకాలు చేరుకోలేదని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. కాగా ఇప్పటి వరకు జిల్లాకు 2,13,880 పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి.

సుమారు 55 శాతం పుస్తకాలు జిల్లా కేంద్రానికి వచ్చాయి. ఇంకా 1,71,540పుస్తకాలు రావాల్సి ఉన్నాయి.

తగ్గిన బరువు..తీరనున్న ఇబ్బందులు

పాఠ్య పుస్తకాల బరువు మోత విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూప కుండా ప్రభుత్వం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. పుస్తకాల బరువు మోతను నివారించేందుకు పుస్తకం ముద్రించే కాగితం మందం తగ్గించారు. దీంతో బరువు తగ్గి పిల్లల ఇబ్బందులు తీరనున్నాయి. జిల్లా వ్యాప్తంగా అవసరమయ్యే పుస్తకాల సంఖ్యలో ఇప్పటివరకు సుమారు 55 శాతం వరకు పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, మరాఠీ భాషల్లో వీటిని రూపొందించారు.

నోట్ బుక్కులు సైతం...

ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్కులు సైతం ప్రభుత్వం అందించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగం గా పలు నోట్ బుక్కులు సైతం జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 3,82,321 నోట్ బుక్కులు అవసరమ వుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటివరకు 95,200 నోట్ బుక్కులు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. ఇంకా 2,21,340 నోట్ బుక్కులు రావాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలల పిల్లలకు అవసరమైన వర్క్‌బుక్స్ సైతం పంపిణీ చేయను న్నారు. 6వ, 7వ తరగతుల విద్యార్థులకు ఆరు చొప్పున, 8వ తరగతి విద్యార్థులకు 7 నోటు బుక్కులు, 9వ, 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి 14 చొప్పున నోట్ బుక్కులు అందజేయ నున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, టీ ఎస్ డబ్ల్యూ ఆర్ఈఐఎస్, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడానికి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి.

అరకొరగా వస్తే సమస్యలే...

పూర్తి స్థాయిలో పుస్తకాల సరఫరా కాకుండా అరకొరగా వస్తే సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. గత యేడాది పుస్తకాలు ముందుగానే వచ్చినప్పటికీ కొన్ని తరగులు, సబ్జెక్టులకు సంబంధించి సరఫరా కాలేదు. ప్రధానంగా ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు రాలేదు. హిందీ పాఠ్య పుస్తకాలు కొరత నెలకొంది. దీంతో చదువుకునేందుకు ఉన్నత తరగతుల విద్యార్థులు ఇబ్బందుల పాలయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరమైనా పూర్తి స్థాయిలో అందేలా విద్యాశాఖ అధికారులు దృష్టి సారిం చాల్సిన అవసరముంది.

ఏ యేడుకు ఆ యేడు పాఠ్యపుస్తకాల పంపిణీలో అధికారులు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పుస్తకాల పంపిణీ సక్రమంగా జరపడంలో అధికారుల వైఖరి మారడం లేదని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. పాఠశాలలు తెరిచే సమయానికి పాఠ్యపుస్తకాలను అరకొరగా పంపిణీ చేస్తుండడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుత సంవత్సరం సైతం పాఠ్య పుస్తకాల కొరత సమస్యను విద్యార్థులు ఎదర్కొ నక తప్పని పరిస్థితి కనిపిస్తుందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పాఠశాలలను ప్రారంభించే సమయానికి విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దరూర్ క్యాంపు గోదాములో నిల్వ...

జిల్లా కేంద్రానికి చేరుకుంటున్న పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, వర్క్ బుక్కులను దరూర్ క్యాంపులో గల ప్రత్యేక గోదాములో విద్యాశాఖ అధికారులు నిల్వ చేస్తున్నారు. ఇందుకు ఆరుగురు సభ్యులుగా ప్రత్యేక బృందం అధికారులకు బాధ్యతలు అప్పగించారు. డిస్ట్రిక్ట్ టెక్స్ బుక్స్ మేనేజర్‌గా బొల్లారపు రాజయ్య, సహాయ అధికారిగా అప్పాల గంగయ్య, సీఆర్‌పీలుగా సీహెచ్ రవి, పుత్త గంగారాం, అయిల్నేని సతీష్‌రావు, ఎండీ ఇమ్రాన్ ఖాన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా జిల్లా కేంద్రానికి పుస్తకాలు పూర్తిగా చేరుకున్న తర్వాత వాటిని మండల విద్యా వనరుల కేంద్రానికి పంపించనున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేయనున్నారు. జూన్ 12వ తేదీన పాఠశాలల పునః ప్రారంభం లోపు కొత్త పుస్తకాలు వారికి అందించేలా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సకాలంలో అందిస్తాం

రాజయ్య, డిస్ట్రిక్ట్ నోట్ బుక్ మేనేజర్, జగిత్యాల

వచ్చే విద్యా సంవత్సరానికి గాను ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందించడానికి చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటివరకు వ చ్చిన పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు అందించి పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు సరఫరా చేయడానికి పనులు చేపట్టాము. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు అక్కడి నుంచి పాఠశాలలకు అవసరమైన సంఖ్యలో పుస్తకాలను సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నాము.

పాఠ్యపుస్తకాల సరఫరాలో జాప్యం నివారించాలి

దొనికెల నవీన్, రాష్ట్ర బీజేవైయం కార్యవర్గ సభ్యుడు

ప్రభుత్వం పాఠ్య పుస్తకాల సరఫరాలో జాప్యం నెలకొనకుండా నివారించాలి. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటుతో పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తోంది. దీనికి తోడు మన ఊరు, మన బడి పేరిట కార్యక్రమాలు చేపడుతోంది. కానీ విద్యార్థులకు అవసరమైన పుస్తకాల సరఫరాపై దృష్టి సారించకపోవడం సమంజసం కాదు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అప్రజాస్వామికం

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై లాఠీచార్జీకి కారకుడయిన నారాయణ ఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుకోవెల శ్యాం సుందర్, అంబటి భూమేశ్వర్‌లు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ఎన్నికల డీఏ చెల్లించాలన్నందుకు గానూ ఉపాధ్యాయులపై బలప్రయోగాన్ని చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీఓ, ఏపీఓలకు రోజుకు రూ. 600, ఓపీఓ లకు రూ. 400 ఇవ్వాల్సి ఉందన్నారు. నిబంధనలను పాటించడంలో నిలదీసిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేయించడం సమంజసం కాదన్నారు. సంఘటన పై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉమ్మడి కుటుంబాలతోనే సంస్కృతి సాంప్రదాయాలు

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్



సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కుటుంబాలతోనే సంస్కృతి, సాంప్రదాయాలు ముందు తరాలకు అందేలా చేస్తాయని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు ఆదర్శ కుటుంబాలను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హరి అశోక్ కుమార్ మాట్లాడారు. కుటుంబాల ప్రాధాన్యతను గుర్తించి ఐక్య రాజ్య సమితి 1994లో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రతీ యేటా మే 15వ తేదీన పాటించాలని సభ్య దేశాలకు పిలుపు నిచ్చిందన్నారు. ఉమ్మడి కుటుంబాల సంస్కృతికి నిలయమైన భారత దేశంలో కుటుంబాలు కాలక్రమంలో ఎన్నో మార్పులకు లోనవుతున్నాయన్నారు. స్వల్ప వివాదాలతో భార్యాభర్తలు విడిపోవడం, సింగిల్ ఫాదర్, మదర్‌తో పిల్లలు ఎదగడం వంటివి కొన్ని కుటుంబాల్లో కనబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జీఆర్ దేశాయి, సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి మెలముల ప్రకాశ్ రావు, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, నాయ కులు హన్మంతరావు, యాకూబ్, అశోక్, సతీష్, గంగాధర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతోనే నేరాల నియంత్రణ

జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్



సీఐకి చెక్కును అందజేస్తున్న వైద్యులు

జగిత్యాల టౌన్, మే 15: సీసీ కెమారాల ఏర్పాటుతో నేరాలను నివారించవచ్చునని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ అన్నారు. సీసీ కెమరాల ఏర్పాటుతో కలిగే లాభాలపై వారం రోజులుగా టౌన్ సీఐ వేణు గోపాల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. సమాజం పట్ల సామాజిక బాధ్యతతో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వైద్యులు ముందుకు వచ్చి సీసీ కెమరాల ఏర్పాటుకు తమ వంతుగా రూ. 40 వేల విరాళాన్ని అందజేశారు. వైద్యుల కళ్యాణ్‌కుమార్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

పెద్దపల్లి స్థానంలో కాంగ్రెస్‌దే విజయం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



ధర్మపురిలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మే 15: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జోస్యం చెప్పారు. ధర్మపురిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో గని కార్మికుడికి, శ్రీమంతుడికి మధ్య పోటీ అని ప్రచారం చేసుకున్న కొప్పుల ఈశ్వర్ చివరి నిమిషం వరకు ఎందుకు ప్రజలను ఓటు అడగలేదని ప్రశ్నించారు. పోలింగ్ రోజు మధ్యాహ్నం 2 గంటల తరువాత బీఆర్ఎస్ నాయకులు తాము గెలవడం కష్టం గా ఉందని, కాంగ్రెస్ గెలిస్తే బాగుండదని భావించి బీజేపీకే ఓటు వేయమని చెప్పారని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని 10 ఏళ్ల పాటు పాలించి, ఉద్యమ పార్టీగా పేరొందిన టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చిన పార్టీ కేవలం నాలుగు నెలలకే అస్త్ర సన్యాసం స్వీకరిస్తుందని తాము అనుకోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి టెంపుల్ సిటీ అభివృద్ధి పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాల ఏర్పాటు, పత్తిపాక రిజర్వాయర్ వంటి సమస్యలు తీసుక వెళ్లినట్లు ఆయన తెలిపారు. పత్తిపాక రిజ ర్వాయర్, రోళ్లవాగు వంటి సమస్యలను పూర్తి చేసి వెల్గటూర్, ధర్మారం, బీర్‌పూర్, ధర్మపురి మండలాల రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు. ఆగస్టు 15 లోగా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని సీఎం ప్రకటించారన్నారు. ధాన్యం విషయమై మాట్లాడుతూ కలెక్టర్, సివిల్ సప్లై అధికారులతో మాట్లాడామన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రితో మాట్లాడి ధర్మపురి నియోజకవర్గ రైతాంగానికి సంబంధించి మిల్లులను పెంచే విధంగా చూస్తామన్నారు. అనంతరం నేరెళ్ల గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త రాకేష్ తండ్రి ఇటీవల మృతి చెందగా పరామర్శించారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్, రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రసాద్, మండల అధ్యక్షులు రాందేని మొగిలి, పట్టణ అధ్యక్షులు తిరుపతి ఉన్నారు.

జిల్లాలో 2.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తి

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు బుధవారం తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. ఇందులో సుమారు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలించడం జరిగిందన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీ గడువు పెంపు

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరుకాగోరు విద్యార్థులకు ఫీజు గడువును పొడగించినట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. వెయ్యి అపరాధ రుసుముతో ఈనెల 16వ తేదీ లోపు చెల్లించవచ్చన్నారు. విద్యార్థులు సంబంధిత ప్రిన్సిపాల్స్‌ను కలిసి పరీక్ష ఫీ చెల్లించాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మల్లాపూర్, మే, 15 : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ అనిల్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తధాంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన మామిడాల లిఖిత, సామ శరణ్య, చల్ల వైశాలి అను విద్యార్థులు పదోవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించినందుకు వారిని శాలువలతో సన్మానించి సత్కరించారు. విద్యార్థులు సాధించిన ఫలితాలు తమతో పాటు తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరును వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్తక సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ

రాయికల్, మే 15: రాయికల్ పట్టణ వర్తక సంఘం అధ్యక్షుడిగా ఎలగందుల సత్యనారాయణ బుధవారం ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అనంతుల సంపత్, ముక్క రంజిత్, కార్యదర్శిగా నరంశెట్టి మహేష్, సంయుక్త కార్యదర్శిగా చౌడారపు లక్ష్మీనారాయణ, కోశాధి కారిగా సిద్దంశెట్టి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

జిల్లాకు వర్ష సూచన

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల మూడు రోజుల్లో మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని పొలాస పరిశోధన స్థానం సాంకేతిక అధికా రిణి శ్రీలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్ష సూచన ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40వరకు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదు అవుతాయన్నారు.

కాయ్ రాజా.. కాయ్

- పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగులు
- అభ్యర్థుల గెలుపోటములపై అంచనాలు
- జగిత్యాల జిల్లాలో జోరుగా చర్చలు



జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): లోక్ సభ పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో భద్రమైంది. ప్రధాన రాజకీయ పక్షాలు, అభ్యర్థులు ఎవరికి వారే గెలుపుపై దీమా వ్యక్తం చేస్తుండగా, కార్యకర్తలు మాత్రం కాయ్ రాజా కాయ్ అంటున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లాలో ఎన్నికలపై ఆసక్తి ఉన్నవారంతా ఇప్పుడు బెట్టింగ్‌లు చేసుకుంటున్నారు. జిల్లాలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలు ఉండగా, ఆయా నియోజకవర్గాల్లోని కార్యకర్తలు రాజకీయంపై ఆసక్తి ఉన్నవారంతా ఇప్పుడు గెలుపోటములపై ఛాలెంజ్‌లు వేసుకుంటున్నారు. తమ పార్టీ, నాయకుడు గెలుస్తాడని ఒకరు, తమ పార్టీ నాయకుడికే మెజార్టీ వస్తుందంటూ మరొకరు పందేలు కాసుకుంటున్నారు. జగిత్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎవరికి మెజార్టీ వస్తుందో అనే దానిపై పందేలు కాసుకుంటున్నారు. కొందరు మందు, విందు ఇస్తామని బెట్టింగ్‌లు వేసుకుంటుంటే.. మరికొందరు పెద్ద మొత్తంలో డబ్బులపై కూడా పందేలు కాసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్‌లో గల కొడిమ్యాల, మల్యాల మండలాలు, వేములవాడ సెగ్మెంట్‌లోని కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలు, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్‌లలో పందేలు కాసుకుంటున్నట్లు రాజకీయ వర్గాలు అంటున్నాయి. జగిత్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పక్షాలకు చివరి వ రకు టఫ్ ఫైట్ నడిచింది. కోరుట్ల, జగిత్యాల, ధర్మపురిలలో కూడా ప్రధాన పార్టీలు, అభ్యర్థుల మధ్య నువ్వా, నేనా అన్నట్లుగా పోరు సాగింది. పోలింగ్ సరళి, పెరిగిన ఓటింగ్ శాతం ఆధారంగా కార్యకర్తలు, యువకులు బెట్టింగ్ కాస్తున్నారు.

నిజామాబాద్ పార్లమెంట్‌లో 29 మంది అభ్యర్థులు పోటీలో...

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 29 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ఇందులో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య పోటీ నెలకొంది. పలువురు ఔత్సాహికులు నియోజకవర్గంలో అభ్యర్థులు, పార్టీలకు వచ్చే మెజార్టీలపై అంచనాలు వేస్తున్నారు. అంచనాల్లో పోటీ పడుతూ పలువురు యువకులు, ఔత్సాహికులు బెట్టింగులకు పాల్పడుతున్నారు. జగిత్యాల, ధర్మపురి, రాయికల్, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో అభ్యర్థుల విజయంపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కార్యకర్తలు, నేతల ఆర్థిక పరిస్థితులను బట్టి బెట్టింగులుంటున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

ప్రేమ వ్యవహారంలో యువకుడిపై దాడి?

కరీంనగర్ క్రైం, మే 15: ప్రేమ వ్యవహారంలో ఒక యువకుడిని కొత్తపల్లి మండలం రేకుర్తి వద్ద కొందరు దాడిచేసి గాయపరిచినట్లు తెలిసింది. రామగుండం ప్రాంతానికి చెందిన యువతీ యువకులు ప్రేమించుకుని వివాహం చేసుకునేందుకు మంగళవారం కరీంనగర్‌కు వచ్చారు. యువతికి సంబంధించిన బంధువులు వారిని వెంబడించి రేకుర్తి వద్ద వారిని అడ్డుకుని యువకుడిపై దాడి చేసి, అతడిని మరో ప్రాంతానికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. వరంగల్‌కు చెందిన యువకుడు కొంత కాలంగా రామగుండం ప్రాంతంలోనే ఉంటూ ఆ ప్రాంతంలోని ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకునేందుకు యత్నించగా ఈ ఘటన చోటు చేసుకుందని సమాచారం. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిసింది.

ఆకట్టుకున్న చిరుతల రామాయణం

మల్యాల, మే 15: మండలం లోని సర్వాపూర్‌లో సీతారామాంజ నేయ భజన మండలి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చిరుతల రామాయణము నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీ భక్త మార్కండేయ నాటక కళా మండలికి చెందిన కళాకారులు ఈ ప్రదర్శన నిర్వహించారు. సర్వా పూర్, బల్వంతాపూర్, కొత్తపల్లి తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాటక ప్రదర్శనను తిలకించారు.


సర్వాపూర్‌లో కళాకారుల ప్రదర్శన

అసంపూర్తిగా ఉల్లంపల్లి-సుందరగిరి రోడ్డు

● 10 నెలలు గడిచినా పూర్తికాని వైనం ● దుమ్ము, ధూళితో ఇబ్బందిపడుతున్న ప్రజలు

చిగురుమామిడి, మే 15: మండలంలోని ఉల్లంపల్లి-సుందరగిరి గ్రామానికి సంబంధించిన రోడ్డు పనులు నిలిచిపోయాయి. గ్రామ ప్రజల ఉద్యమాల ఫలితంగా గత ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణానికి 2.25 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. నాటి ఎమ్మెల్యే గత ఆగస్టులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదే రోజు మండలంలోని ముదిమాణిక్యం, రామంచ, ఓగులాపూర్ గ్రామాల రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఆ గ్రామాల్లో రోడ్డు పనులు పూర్తయ్యాయి. 10 నెలలు గడిచినా రోడ్డు పనులు పూర్తి కాలేదు. రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, కల్వర్టులు, ఇతర పనులు ఇష్టారాజ్యంగా చేశారనే విమర్శలు వచ్చాయి. సుందరగిరి నుంచి ఉల్లంపల్లి గ్రామం వరకు నామమాత్రంగా ఎర్ర మట్టి పోసి వదిలేసినారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనాల రద్దీ పెరగడంతో దుమ్ము లేచి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిస్తే పనులు సాగవని, ఆలోపే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కోతకు గురవుతున్న ఉల్లంపల్లి-సుందరగిరి రోడ్డు

రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం..

- చట్ల తిరుపతి, ఉల్లంపల్లి



మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లడానికి సరైనా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం. అనేక అందోళనలు చేసి రోడ్డు సాధించుకున్నాం. కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు పనులు నిలిచిపోయాయి. వాహనాల రద్దీ, పెరిగిపోయి దుమ్ముతో అనేక ఇబ్బందులు పడుతున్నాం.

వర్షాలు పడితే రాకపోకలకు ఇబ్బంది

- బునాద్రి సాయిలు, ఉల్లంపల్లి



ఎన్నో ఆందోళనలు చేసి రోడ్డు సాధించుకున్నాం.. ఆ రోడ్డు పనులను ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం అయితే రాకపోకలు నిలిచి పోతాయి. ఆలోపే పనులు పూర్తి చేయాలి. లేకపోతే ఆందోళనలు చేస్తాం.

త్వరగా పూర్తి చేయాలి

- చీమూర్తి మల్లయ్య, ఉల్లంపల్లి


రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయాయో ఎవరూ చెప్పడం లేదు. వర్షాలు ప్రారంభం అయితే పోసిన మట్టి కొట్టుకుపోతుంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఎన్నో ఆందోళనలు చేసి రోడ్డును సాధించుకున్నాం. ఆ సంతోషం పనుల్లో జాప్యంతో ఆవిరైంది. ఇప్పటికే రోడ్డుపై వేసిన మట్టి లేచిపోతోంది. గ్రామస్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి.

పిడుగుపాటుకు చింతచెట్టు దగ్ధం

● మూడు రోజులుగా చెలరేగుతున్న మంటలు


పిడుగుపాటుకు దగ్ధమవుతున్న చెట్టు

రామడుగు, మే 15: మండల కేంద్రంలో పిడుగుపాటుతో వంద సంవత్సరాల చింతచెట్టు దగ్ధమైంది.. సోమవారం సాయంత్రం చింతచెట్టుపై పిడుగు పడింది దీంతో చెట్టులో మంటలు చెలరేగాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పేశారు. తిరిగి మంగళవారం మరోసారి ఆ చెట్టులో నుంచి మంటలు చెలరేగగా గ్రామస్థులు ఆరేఃశారు.. బుధవారం రాత్రి మరోసారి మంటలు ఎగిసిపడి విద్యుత్ తీగలపై పడడంతో రామడుగులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.. మరోసారి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పేశారు.


మంటలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పీడీఎస్ బియ్యం పట్టివేత

వెల్గటూర్, మే 15: మండలం లోని రాజక్కపల్లి గ్రామంలో ఓ ఇంటిలో నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సవిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. పక్కా సమాచారం మేరకు రాజక్కపల్లిలో పల్లపు శ్రీనివాస్ ఇంటిలో నిలువ ఉంచిన సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. బియ్యం ఉన్న గదిని వెంకటేష్ అనే వ్యక్తికి కిరాయికి ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. వెంకటేష్‌పై కేసు నమోదు చేసి పట్టుబడ్డ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు.

రూ. 7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,150 రూపాయలు పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 95 క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు గోనె సంచుల్లో మూడు క్వింటాళ్ల విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,150, కనిష్ఠ ధర 4,500 రూపాయలు చెల్లించి కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వీర్నపల్లి, మే 15: ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. వీర్నపల్లి మండలకేంద్రంతో పాటు ఎర్రగడ్డ తండా కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటనే జమ చేసేలా చూడాలన్నారు. ఆయన వెంట డీపీఎం పాపారావు, ఏపీఎం నర్సయ్య, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

బత్తుల భూమయ్య సేవలు చిరస్మరణీయం


బత్తుల భూమయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, మే 15: ఉపాధ్యాయుడిగా, ఎంఈవోగా సేవలందించిన బత్తుల భూమయ్య చిరస్మరణీయుడని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం చొప్పదండిలో జరిగిన బత్తుల భూమయ్య సంతాప సభకు ఆయన హజరై మాట్లాడుతూ భూమయ్య అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు.ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గుండ చంద్రయ్య, ఎంపీపీ చిలుక రవీందర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, నాయకులు కట్టెకోల శ్రీనివాస్‌రావు, వెన్న రాజమల్లయ్య, కాడె శంకర్, వొల్లాల క్రిష్ణహరి, ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి మండలాలకు చెందిన అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తరలించాలని రైతుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

కోనరావుపేట, మే 15: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మల్కపేట రైతులు రోడ్డుపై బైఠాయించి బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. అకాలు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. కొన్న ధాన్యాన్ని తరలించకపోవడంతో కాంటా వేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. రాస్తారోకోతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల రూరల్, మే 15: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలను నిర్వహించి అర్చన, అభిషేకం చేశారు. ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పుస్తె మట్టెలతో గ్రామం నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అర్చకులు స్వామి వారి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో అర్చకులు ఇంద్రాల లక్ష్మీనారాయణ, రమేష్‌తోపాటు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

కోనరావుపేట, మే 15: బ్రిడ్జి నిర్మాణం కోసం ఓ కాంట్రాక్టర్ చెరువు కట్టను ధ్వంసం చేసి అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి శివారులోని చిన్నన్న పెద్దన్నకుంట నుంచి హన్మాజిపేటలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణానికి అక్రమంగా మట్టిని తరలించారు. మట్టిని తరలించేందుకు వాహనాలు వెళ్లడానికి కట్టకు వేసిన రివిట్‌మెంటును ధ్వంసం చేసి వాహనాల ద్వారా అక్రమంగా మట్టిని తరలించారు. మట్టిని తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. మట్టిని తరలించేందుకు వాహనాలు వెళ్లడానికి కట్టను తవ్వించి రివిట్‌మెంటును ధ్వంసం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ధ్వంసం చేసిన కట్టను, రివిట్‌మెంట్‌ను సదరు కాంట్రాక్టర్ చేత బాగు చేయించాలని కోరుతున్నారు.


మామిడిపల్లిలో చిన్నన్న పెద్దన్న కుంటలో మట్టి తవ్వకాలు

ఘనంగా 'సందల్' ప్రదర్శన

● దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు ● హాజరైన ప్రభుత్వ విప్ శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సందల్ ఊరేగింపులో గుర్రపు విన్యాసాలు

ఎల్లారెడ్డిపేట, మే 15: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని దర్వేశ్అలీషా ఖాద్రీ గుట్ట దర్గా వద్ద ఉర్సు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని నిర్వహణకర్త అజీజ్ ఇంటి నుంచి 'సందల్' ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ దర్గా వరకు తీసుకెళ్లారు. గుర్రపు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దర్గా వరకు ప్రదర్శనగా వెళ్లారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత గురువులు బోధనలు చేశారు. అనంతరం ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన రైస్ అనీస్ సబ్రి, రేహన్అలీ ఖవాలీ కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఎంపీపీ రేణుక, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, డీసీఆర్‌బీ డీఎస్పీ సర్వర్‌పాషాతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి వెళ్లి దర్గా ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నసిరిసిల్ల, సిద్ధిపేట, కామారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలతో పాటు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మూడో రోజు నరసింహ నవరాత్రోత్సవాలు

పంచోపనిషత్తులతో అభిషేకం, ప్రత్యేక పూజలు



స్వామి వారికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, మే 15: ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో మూడో రోజు బుధవారం శ్రీ నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వ హించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామ వేద పండితులు ముత్యా లశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాస పూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభి షేకం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సామ వేద పారాయణం తో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతో భద్ర మండల, స్థాపిత దేవతా పూజ లు, సహస్ర వరుణ, కలశ స్థాపన, స్థాపిత దేవత హోమాలు నిర్వహించారు. దేశంలో దుర్భిక్ష నివారణ కోసం, సువృష్టి ప్రాప్తికై, సకల ఈతి బాధల నివారణ, అనువాహక హోమాలు నిర్వహించారు. సాయంత్రం కలశ పూజలు, అర్చనాది ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే లోక కల్యాణార్థం సుదర్శన, నారసింహ హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారిని దర్శనం చేసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చారి, చిలుకుముక్కు రమణాచార్యా, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు నంబి అరుణ్‌కుమార్, వంశీకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.



కళశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రాణం తీసిన ఈత సరదా

బావిలో మునిగి ఇంటర్ విద్యార్థి దుర్మరణం

ఓదెల, మే 15: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. మండలంలోని జీలకుంటలో బుధవారం దొడ్డేపల్లి అరవింద్ (20) అనే ఇంటర్ విద్యార్థి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో నీటమునిగి మృతిచెందాడు. గ్రామస్థులు కుటుంబ సభ్యులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అరవింద్ మిత్రులతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలోకి ఈత నేర్చుకుంటున్నాడు. ఈక్రమంలో బుధవారం బావిలో దిగగా ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వడ దెబ్బతో గొర్రెల కాపరి మృతి

కోరుట్ల రూరల్, మే 15 : మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన బూరుగుల భూమయ్య (62) అనే గొర్రెల కాపరి వడ దెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... భూమయ్య మంగళవారం గొర్రెలు, మేకలను మేపడానికి తీసుకెళ్లి సాయత్రం ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి చేరుకున్న కాసేపటికి విరేచనాలు, వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు సమీపంలో చికిత్స నిమిత్తం జగిత్యాల అసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. భూమయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

వీణవంక, మే 15: మండలంలోని కిష్టంపేట గ్రామనికి చెందిన బొద్దుల బాలయ్య(98) బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 9 గంటలకు బాలయ్య ఇంటి నుంచి బహిర్భూమి కోసం వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా ఇంటి దగ్గరలో గల అప్పాల శ్రీనివాస్ చెందిన బావి పక్కన చెప్పులు చేతి కర్ర కనపడ్డాయి. బావిలో వెతుకగా బాలయ్య మృతదేహం లభించింది. బాలయ్య మతిస్థిమితం బాగాలేదని, బహిర్భూమికి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడని అతని మనువడు బొద్దుల రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

చిగురుమామిడి,మే 15: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన బత్తుల వెంకటయ్య(43) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. వెంకటయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు మొదల వడంతో జీవతంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటయ్య భార్య ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బండి రాజేశ్ తెలిపారు.

కుక్కను తప్పించబోయి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 15: మండలంలోని గొల్లపల్లి బస్టాండు వద్ద కుక్కను తప్పించబోయి బైక్ కింద పడిన సంఘటనలో మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన రాగి దేవేందర్ బుధవారం తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దేవేందర్ తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కుక్క అడ్డు రావడంతో తప్పించేందుకు యత్నించాడు. బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, మే 15: హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ. 5,000 జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి నీలిమ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో పెళ్లి భరత్‌లో డాన్స్ విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. గొడవను మనుసులో పెట్టుకుని ఓరుగంటి రాజు అనే వ్యక్తి 2020 సంవత్సరం డిసెంబరు 20న మరో వ్యక్తిని కత్తితో పొడిచి హత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులు అదే రోజు మేడిపెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాధించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి రాజుకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడండంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

ప్రహరీ విషయంలో వివాదం

● ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ ● గుంజపడుగులో పోలీసు పికెట్



పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

గొల్లపల్లి మే 15: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన చిన్న గొడవ చిలికి చిలికి గాలివానగా మారింది. చిన్న ప్రహరీ గోడ విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన కల్లెం తిరుపతి, పస్తం శారద ఇరు కుటుంబాల మధ్య ప్రహరీ ఉంది. గోడకు సంబంధించి కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఈ రెండు కుటుంబాల మధ్య మాట మాట పెరిగి తిరుపతి శారదను అసభ్యంగా దూషించడంతో ఘర్షణకు దారితీసింది. బాధిత మహిళ కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని తిరుపతి ఇంటి వద్దకు వెళ్లగా గొడవకు దారితీసి చివరికి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో తిరుపతికి సంబంధించిన ఇల్లును శారద కుటుంబ సభ్యులు పాక్షికంగా ధ్వంసం చేశారు. దీంతో కోపోద్రిక్తులైన తిరుపతి కుటుంబ సభ్యులు శారద అన్నదమ్ములైన సమ్మయ్య పోశయ్యపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం జగిత్యాల జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్ కుమార్ తన సిబ్బందితో కలిసి గ్రామాని సందర్శించి ఇరు వర్గాలతో మాట్లాడి గొడవను శాంతింపజేశారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ రామ నరసింహారెడ్డి, ఎస్‌ఐ సతీష్ కుమార్ పరిశీలించారు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి, తిరుమలేష్, శ్రీకాంత్, తోపాటు ఇరు వర్గాల చెందిన మరో ఏడుగురి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

ప్రధాని మోదీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

వేములవాడ టౌన్, మే 15: ప్రధాని నరేంద్ర మోదీ కమలం పువ్వు గుర్తు ధరించి రాజన్న ఆలయంలోకి ప్రవేశించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 8వ తేదీన వేములవాడ రాజన్నను దర్శించుకున్న ప్రధాని మోదీ బీజేపీ ఎన్నికల గుర్తు కమలం పువ్వు గుర్తుతో రాజన్నను దర్శించుకున్నారని ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారంటూ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై వేములవాడ సహాయ రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్‌తో మాట్లాడగా తమకు వాట్సప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. విచారణ చేపట్టిన తర్వాత పూర్తి విషయాలు వివరిస్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు దిమ్మతిరిగే ఫలితాలు

ఎంపీ బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 15: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దిమ్మతిరిగే ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని వి కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌కు లోక్‌సభ ఫలితాలు షాక్ ఇవ్వబోతున్నాయన్నారు. దేశమంతా నరేంద్రమోదీ హవా కొనసాగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలువడం ఖాయమన్నారు. ఎన్నికల్లో బీజేపీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, పెద్దపల్లి నుంచి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన ఆరూరి రమేష్, సీతారాం నాయక్, సైదిరెడ్డి, గోమాసె శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, ధన్‌పాల్ సూర్యానారాయణ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి మనో హర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణిరుద్రమాదేవి, జనవాడ సంగప్ప పాల్గొన్నారు.

కన్న కూతురిపై తండ్రి అత్యాచారం

నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష

రూ. 1,000 జరిమానా, బాధిత బాలికకు రూ. 3 లక్షల పరిహారం

జగిత్యాల టౌన్, మే 15: కన్నకూతురిపై తండ్రి అత్యాచారం చేసిన కేసులో 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు బాధిత బాలికకు రూ. 3 లక్షల పరిహారం ఇవ్వాలంటూ జిల్లా ప్రధాన న్యాయాధికారి నీలిమ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన వ్యక్తి వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మొదటి భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిపై గతంలో కేసు ఉంది. అనంతరం వేరే మహిళను వివాహం చేసుకోగా కూతురు జన్మించింది.

2022 సంవత్సరం అక్టోబరు 14న రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో కన్న కూతురు (మైనర్)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే భార్యతో పాటు బాలికను పెట్రోల్ పోసి చంపివేస్తానని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైన తల్లి తన బాలికతో కలిసి నాలుగు రోజుల అనంతరం నిందితుడి మొదటి భార్య కుమారుడికి జరిగిన దారుణాన్ని వివరించింది.

దీంతో బాలిక సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు పోలీసులు సరైన సాక్ష్యలను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాధించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడండంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

మూడు రోజుల పాటు డడ్జ్‌బాల్ పోటీలు

య్యైటింక్లయిన్‌కాలనీ, మే 15: ఇండియన్ డడ్జ్ బాల్ ఫెడరేషన్ కప్-2024 జాతీయ పోటీలు ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డడ్జ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో జరిగే పోటీలకు దేశంలోని 12 రాష్ట్రాల నుంచి 20 జట్లు పాల్గొననున్నాయని, 120 మంది పురుషులు, 120 మంది మహిళలు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి ఆగస్టులో ఆస్ట్రేలియాలో జరగనున్న వరల్డ్ డడ్జ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అనిల్‌కుమార్, పాశం శ్రీనివాస్, ఓదేలు యాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలి

కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

జమ్మికుంట, మే 15: రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలని కేవీకే ప్రధాన శాస్త్ర వేత్త వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వాతవర ణంలో మార్పుల కారణంగా వ్యవసాయంలో వచ్చే మార్పులు గమనించి, వాటికి అనుగుణంగా చేపట్టాల్సిన విధానాలు వివరించారు. రాబోయే కాలంలో మనం నేలను రక్షించకపోతే మనం భావితరాలకి అందించడానికి ఏం మిగలదని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటి నుంచిప్రకృతి సేద్యం వైపు దృష్టి సారించా లన్నారు. నీటిని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ విభాగాల శాస్త్ర వేత్తలు సేద్య, ఉద్యాన, చేపల చెరువుల అభి వృద్ధి, చీడ పీడల నివారణ, గృహ విజ్ఞాన విషయాలపై చర్చించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతులు, విద్యా ర్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

కారు బైక్ ఢీ... ఒకరికి గాయాలు

చందుర్తి, మే 15: చందుర్తి మండలం మల్యాల గ్రామంలో కారు బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువ కుడికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రా మానికి చెందిన ఎల్లా రమేష్ అనే వ్యక్తి బైక్‌పై వెళు తుండగా బస్టాండ్ సమీపంలో కారు ఢీకొనడంతో రమేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

తాడికల్‌లో రోడ్డు ప్రమాదం

● డీజిల్ ట్యాంకర్ బోల్తా.. ఒకరు మృతి ● పలువురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళలు

శంకరపట్నం, మే 15: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో కరీంనగర్- వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి నిర్మాణం పనులు చేస్తున్న సంస్థకు సంబంధించిన డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నాడు. డీజిల్ ట్యాంకర్ తాడికల్ గ్రామ పంచాయతీ ఎదురుగా అదుపు తప్పి రోడ్డు పక్క న నిల్చున్న వారి మీదకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో పూదరి శ్రీనివాస్ (39) అక్కడికక్కడే మృతి చెందగా, వెంగళ కనకమ్మ, ఆడెపు మౌనిక, చాగంటి ప్రకాష్, మంద రాజమ్మ, తాడిచర్ల సంపత్, ఉప్పరి మధురమ్మ, ఆడెపు లాస్య గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, కేశవపట్నం ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రు లను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన పూదరి శ్రీనివాస్‌ను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య పూదరి రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.





మృతుడు పూదరి శ్రీనివాస్ (ఫైల్)



బోల్తా పడిన డీజిల్ ట్యాంకర్

పూర్తి స్థాయి ఎంఈవోలను నియమించాలి

ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు రవీందర్

కొడిమ్యాల, మే 15 : జిల్లాలో పూర్తి స్థాయి ఎంఈవోలను నియామకం చేయాలని కోరుతూ బుధవారం ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ జిల్లా కలెక్టర్, డీఈవోకు వినతి పత్రం అందించారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి ఒక ఎంఈవో ఉండాల్సి ఉండగా జిల్లాలోని 18 మండలాల్లో 8 మంది ఎంఈవోలు మాత్రమె జిల్లా వ్యాప్తంగా భారంగా ఎంఈవో విధులు నిర్వహిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఒక ఎంఈవో మూడు లేదా నాలుగు మండలాలకు సంబంధించిన అదనపు బాధ్యతలను నిర్వహించడంతో ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అంతే కాకుండ మోడల్ స్కూల్ కస్తూరీబా పాఠశాలలు, విద్యార్థులకు అందించె మధ్యాహ్న బోజనం విషయాలలో పర్యవేక్షణ కొరవడుతుందన్నారు. ఇటీవల జిల్లాలోని ఒక ఎంఈవో పని బారం వలన మృతి చెందినట్లు తెలిపాడు. జిల్లాలో పూర్తి స్థాయి ఎంఈవోలను నియమించాలని రవీందర్ కోరారు.

సహకార సంఘాల్లో సిబ్బంది తొలగింపు

మెట్‌పల్లి రూరల్, మే 15: మెట్‌పల్లి విశాల సహకార సంఘం, బండలింగాపూర్ సహకార సంఘంలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ అసిస్టెంట్లు ఎన్నికల నిబంధనలు ధిక్కరించినందుకు విధుల నుంచి తాత్కాలికంగా తొలగించాలని డీసీవో కమిటీకి సిఫార్సు చేసింది. బుధవారం మెట్‌పల్లి సహకార సంఘంలో కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించి డీసీవో ఆదేశాల మేరకు స్టాఫ్ అసిస్టెంట్ అయిన రాజేష్, అంకం శంకర్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు తీర్మానం చేశారు. ఈ మేరకు బండలింగాపూర్ గ్రామంలో కమిటీ సమావేశాన్ని నేడు నిర్వహించడం ఉన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ విషయమై డీసీవో సత్యనారాయణను వివరణ కోరగా ఎన్నికల నియమ నిబంధనలు ధిక్కరించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో విచారణ చేయించామన్నారు. వారిపై వచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ సూచనలతో స్టాఫ్ అసిస్టెంట్లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగింపుపై కమిటీకి సూచించామన్నారు. సిబ్బంది తిలగింపుపై కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

తెగిన చెరువులు పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కథలాపూర్, మే 15 : మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు గత వర్షాలకు తెగిపోయిన నేపథ్యంలో ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో చెరువులు, కుంటల మరమ్మతులకు మోక్షం లభించేనా' అనే కథనం ప్రచురితం కాగా ఇరిగేషన్ అధికారులు స్పందించారు. బుధవారం గంభీర్‌పూర్ కొచ్చెరువు, బొమ్మెన ప్రాజెక్ట్ మత్తడి, దుంపెట ఊరచెరువులను ఇరిగేషన్ డీఈఈ ప్రశాంత్, ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. గంభీర్‌పూర్ కొచ్చెరువు, దుంపెట ఊర చెరువుకు రు. 10 లక్షల చొప్పున, అదేవిధంగా బొమ్మెన ప్రాజెక్ట్ మత్తడి మరమ్మత్తులకు కేటాయించిన రు. 29 లక్షల నిధులతో పనులు చేపట్టాలని ఆదేశించారు, వర్షాలు ఆరంభయ్యే పరిస్థితులు ఉన్న కారణంగా సత్వరమే పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను పిలిచి ఆదేశించారు. గంభీర్‌పూర్ కొచ్చెరువుకు సంబంధించిన చెరువు మట్టిని సేకరించి నమూనాను ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, రాష్ట్ర ఫిషర్‌మెన్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ట్రాన్స్‌కో ఏడీ మనోహర్

మెట్‌పల్లి రూరల్, మే, 15 : గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులతో కలుగు అంతరాయనికి రైతులు, వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏడీ మనోహర్ కోరారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా మెట్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలోని 33 కేవీ ఫీడర్లకు మరమ్మత్తులు చేస్తున్నామన్నారు. వర్షాలు, ఈదురు గాలులకు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా ముందస్తు జాగ్రత్తల కింద వైర్లకు ఆనుకున్న చెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో వంగిన స్తంభాలు, వేలాడే లైన్లు సరిచేయడానికి, తెగిన స్టే వైరు సరిదిద్దడానికి ఈనెల 17న జగ్గాసాగర్, వెల్లుల్ల సబ్‌స్టేషన్‌ల్లో, 18న కోనరావుపేట, వేంపేట, చౌలమద్ది మెట్‌పల్లి టౌన్‌ల్లో, 19న ఆత్మకూర్, 20న మేడిపల్లి, వెంకట్రావుపేట, బండలింగాపూర్, మెట్లచిట్టాపూర్, అమ్మక్కపేట, డబ్బా వాటర్ గ్రిడ్ సబ్‌స్టేషన్‌ల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలివేస్తామన్నారు. గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని, విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయనికి రైతులు, వ్యాపారస్థులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తప్పుడు సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి


ఓబులాపూర్ గ్రామస్థుల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఓబులాపూర్ గ్రామస్థులు

మల్లాపూర్, మే, 15 : మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో తప్పుడు సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. బుధవారం మల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ వీర్‌సింగ్‌కు గ్రామస్థులు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామ శివారులోని 49 సర్వే గల భూమిని ఎవరికి సమాచారం అందించకుండా అధికారులు తప్పుడు సర్వే చేసి గ్రామస్థుడికి పంచనామా చేసి అందించారన్నారు. దీంతో ఆ భూమి చుట్టూ ఉన్న 41, 47, 48 లోకి అక్రమంగా చొరబడి ఆక్రమించుకున్నట్లు తెలిపారు. గ్రామ శివారులోని 41 సర్వే నంబరులో 35 ఏళ్ల క్రితం వన సంరక్షణ సమితి ద్వారా చెట్లను పెంచుతున్నామన్నారు. అధికారులు ఎవరికి సమాచారం ఇవ్వ కుండా తప్పుడు సర్వేతో 41 సర్వే నంబరులో నాటిన చెట్లను తొలగించేం దుకు గ్రామస్థుడు సిద్ధమయ్యాడన్నారు. తప్పుడు సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకొని మళ్లీ గ్రామంలో సర్వే చేసి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. స్పందించిన తహసీల్దార్ సమ స్యను పరిశీలించి మళ్లీ సర్వే చేయిస్తానని తెలపడంతో గ్రామస్థులు నిరసను విరమించారు.

బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



గంభీర్‌పూర్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కథలాపూర్, మే 15 : మండలంలోని గంభీర్‌పూర్‌లో బుధవారం జరిగిన బీరప్ప జాతర ఉత్సవాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు స్థానిక పూజారులు ఘనంగా స్వాగతం పలకగా గ్రామస్థులు శాలువాతో సత్కరించారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, రాష్ట్ర ఎన్నారై సెల్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, పులి హరిప్రసాద్, ఉరుమల్ల చారి, జవ్వాజి రవి తదితరులు ఉన్నారు.

'అభయహస్తం' డబ్బులు వాపస్ వచ్చేదెన్నడు..?

- గతంలో పథకాన్ని రద్దు చేసిన బీఆర్‌ఎస్ సర్కారు
- కొత్త ప్రభుత్వం పథకాన్ని పునరుద్ధరిస్తుందని మహిళల ఆశలు
- జగిత్యాల జిల్లాలో సుమారు రూ. 3.03 కోట్లు బకాయిలు



జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అభయ హస్తం పథకం కింద మహిళలు చెల్లించిన ప్రీమియం డబ్బులు తిరిగి పొందడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఏర్పడ్డ సీఎం రేవంత్ రెడ్డి సర్కారుపై స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు అభయహస్తం బీమా పథకంపై ఆశలు పెంచుకున్నారు. సంఘాల్లోని మహిళలకు బీమా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అభయహస్తం పథకం అమలు చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసింది. పదేళ్ల విరామం తరువాత తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో తాము చెల్లించిన ప్రీమియం డబ్బులు వాపస్ ఇస్తారని లేదా, పథకాన్ని మళ్లీ పునరద్ధరిస్తారన్న ఆశాభావంతో లబ్దిదారులు ఎదురుచూస్తున్నారు. దీని కోసం జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో సెర్ప్, మున్సిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నారు. 2009లో అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి ఎల్ఐసీ తో కలిసి స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల కోసం పథకం ప్రారంభించారు. ఈ పథకంలో 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు కలిగిన మహిళలు సుమారు 90,503 సభ్యులుగా చేరి ఏడాదికి రూ. 335 చొప్పున ప్రీమియం చెల్లించారు. 59 ఏళ్ల వయస్సు నిండే వరకు ప్రీమియం చెల్లింపులు జరిపారు. 60వ సంవత్సరం నుంచి చివరి మజిలీ వరకు నెలకు రూ. 500 నుంచి రూ. 2,250 వరకు మహిళలకు అభయహస్తం కింద పింఛన్ వచ్చేది. పాలసీదారు చనిపోతే అంత్యక్రియల ఖర్చులకు రూ.5 వేలు, సహజ మరణానికి రూ. 30 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 75,000 పరిహారం అందించేవారు. పాలసీదారుకు 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే పిల్లలు ఉంటే ఇద్దరికి రూ.1,200 చొప్పున ఉపకార వేతనం అందేది. సభ్యులు 2009 నుంచి 2013వరకు ఏటా రూ. 335 చొప్పున ఐదేళ్లలో సుమారు రూ. 3,03,18,505 వరకు ప్రీమియం చెల్లించారు. రాష్ట్రం ఏర్పాటు తరువాత అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని రద్దు చేసింది. అప్పటి నుంచి పథకం అమలు కాక పోగా, మహిళలు చెల్లించిన ప్రీమియం డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదు. 2022 మార్చిలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అభయ హస్తం పథకం కింద చెల్లించిన ప్రీమియం డబ్బులను మహిళల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా లెక్కపత్రాలు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏలను ప్రభుత్వం ఆదేశించడంతో పాలసీదారుల వ్యక్తి గత బ్యాంకు ఖాతాలు అప్‌డేట్ చేశారు. దీంతో తమ డబ్బులు తిరిగి వస్తాయని మహిళలు ఆశించినప్పటికీ నెరవేరలేదు. ఇప్ప టివరకు డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. కొత్త ప్రభుత్వమైనా అభయ హస్తం పథకాన్ని పునరుద్ధరించాలని, లేదా ప్రీమియం డబ్బులు తిరిగి చెల్లించాలని మహిళలు కోరుతున్నారు.

కొత్త ప్రభుత్వం పథకాన్ని అమలు చేయాలి

గండ్ల అమృత, స్వయం సహాయక సంఘ మహిళా సభ్యురాలు,



గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవహరించిన సమ యంలో అమలు చేసిన అభయ హస్తం పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం తిరిగి పునరుద్ధరించాలి. పథకం కింద మహిళలు చెల్లించిన ప్రీమి యం డబ్బులు తిరిగి ఖాతాల్లో జమ చేయాలి. పథకం లబ్ధిదారుల సమ స్యల పరిష్కారానికి కొత్త సర్కారు చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం నిర్ణయం ప్రకారమే...

సంపత్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి



అభయ హస్తం పథకం కింద స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన ప్రీమియం డబ్బులు తిరిగి ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాము. ఇందుకు అవసర మైన వివరాలను ఇప్పటికే సిద్ధం చేశాము.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



రంగదామునిపల్లెలో బీరప్ప పట్నాల ఉత్సవాల్లో పాల్గొన్న లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, మే 15: ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం పర్యటించారు. మండలంలోని రంగదామునిపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న బీరయ్య పట్నాల మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఒగ్గు కళాకారుల ఢమరుక నాదాల నడుమ లక్ష్మణ్ కుమార్‌కు పూర్ణ కుంబాభిషేకంతో ఘన స్వాగతం పలికారు. మొదటిసారి బీరప్ప ఆలయాన్ని సందర్శించడంతో కురుమ సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం గర్భగుడిలోని బీరప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాఘవపట్నం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త శ్రీకాంత్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన పుట్ట మధు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన మద్దూరి వెంకయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ విప్ వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, తాజా మాజీ ప్రజాప్రతినిధులు గంగాధర్, రాజ్యలక్ష్మితిరుపతి రెడ్డి, వెంకటేష్ గౌడ్, నాయకులు భీమ సంతోష్, హన్మాండ్లు, అరవింద్ గౌడ్, అనిల్ కుమార్, శ్రీనివాస్, వినోద్, దిలీప్, గంగాధర్ పాల్గొన్నారు.

'ఫొటోలు తీయడంలో ట్రెండ్ ఫాలో కావాలి'

మెట్‌పల్లి, మే, 15 : అధునాతన సమాజంలో కెమారా, వీడియో గ్రాఫర్స్ ట్రెండ్‌ను ఫాలో కావాలని కెమెరా క్లబ్ అధ్యక్షుడు పెరంబుదరి శ్రీధర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్స్‌లో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన ఫోటో, వీడియో గ్రాఫర్స్‌కి అధునాతన కెమెరాలపై కెనాన్ కంపెనీ ప్రతినిధులు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుత ట్రేండింగ్‌కు తగ్గట్టుగా కెమెరాలు వాడుతున్న వారు ఎలా ఫొటోలు, వీడియోలు తీయడం, కెమెరాలను పనితీ రుపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కెమెరా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ ట్రెండ్‌కు తగ్గట్టుగా కస్టమర్లకు నచ్చే విధంగా ఫొటోలు, వీడియోలను అధునాతన టెక్నాలజీలతో షూటింగ్ చేసి కస్టమర్ల మన్ననలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనాన్ కంపెనీ ప్రతినిధులు పూర్ణన్, వెంకటేష్, శరత్ సాగర్, కెమెరా క్లబ్ ఉపాధ్యక్షుడు పిట్ల రాంప్రసాద్, ముదాం శ్రీనివాస్, గుజ్జేటి శ్రీనివాస్, చిలివేరి మహేష్, రాజారపు గంగరాజం, బాలు రాఘవేందర్, సభ్యులు పాల్గొన్నారు.

రామాలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కథలాపూర్, మే 15 : మండలంలోని దూలూరులో బుధవారం శ్రీరామాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ధర్మకర్త ప్రముఖ వైద్యులు ఆకుల లక్ష్మీనారాయణ నేతృత్వంలో ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. వేదపండితులు శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చక్ర స్నానం, పుష్పయాగం, ఏకాంత సేవా కార్యక్రమాలతో ఉత్సవాలను ముగించారు. ఈ ఉత్సవాలు తిలకించేందుకు చుట్టు పక్కన గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎగ్యారపు శ్రీహరి, శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ గుండారపు సౌజన్యగంగాధర్, గ్రామపెద్దలు ఉన్నారు.

ఏఎన్ఎంపై ఫిర్యాదు

తంగళ్లపల్లి, మే 15: ఏఎన్ఎం కరుణ సరిగా విధులు నిర్వహించడం లేదని తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన గడ్డం భాస్కర్‌రెడ్డి నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. పిల్లలకు వ్యాక్సిన్ వేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే తనతో పాటు గ్రామంలోని చాలామంది ఇబ్బందులు ఎదుర్కొన్న ఎదుర్కొంటున్నారని తమకు, పిల్లలకు ఆరోగ్య సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, మే 15: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఇటీవ ల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద అనుప రాజు కుటుంబానికి బుధవారం స్థానిక ఎవర్ గ్రీన్ యువజన సంఘం సభ్యులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కూతురు మనుశ్రీ పేరిట ఆ డబ్బులను తపాలా కార్యాలయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. పత్రాలను ఆ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు స్వామి, మహేందర్, మజీద్, క్రాంతి, శేఖర్, రవి, విక్రం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోరుట్ల, మే 15 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2001-04 విద్యా సంవత్సరంలో డిగ్రీ విద్యాను అభ్యసించిన విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత అపూర్వ సమ్మేళనంగా ఏర్పడారు. బుధవారం పట్టణంలోని ఓ బంకెట్ హాల్‌లో అపూర్వ సమ్మేళనంగా ఏర్పడి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు విద్యాబోధనలు చేసి న ఉపన్యాసకులను సన్మానించి అభినందించా రు. ఈ సంద ర్భంగా కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని తీర్మానం చేసుకున్నారు. ఈ సందర్భం గా పూర్వ విద్యార్థులు సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సంపత్, భూమేశ్వర్, అజ్మత్, సాయిరాం, యాదగిరి, గణేష్, రజిత, రజనీ, అనుజ, ఉమారాణి, హిమ వంతి, మహేష్ పలువురు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదివిన 2008-09 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించా రు. అలనాటి బాల్యం తీపి గురుతులను నెమ రువేసుకున్నారు. 16 ఏళ్ల అనంతరం ఒక్కచోట పూర్వ విద్యార్థులంతా కలుసుకున్న సందర్భంగా ఎంతో ఉత్సాహభరితంగా గడిపారు. బాల్యం నాటి చిలిపి చేష్టలు, గురువులు నేర్పిన బతుకు పాఠాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఉద్యోగాలు, వ్యా పారాలు, ఇతర దేశాల్లో స్థిరపడ్డ వారంతా కలుసుకున్నారు. విద్య నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనం తరం సహపంక్తి భోజనాలు చేశారు.





కోరుట్లలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు..కథలాపూర్‌లో ఒక్కటైన పూర్వ విద్యార్థులు

ఓటింగ్ శాతంలో మంగళపల్లి ఆదర్శం

కోనరావుపేట, మే 15: మంగళపల్లి గ్రామం ప్రతి ఎన్నికల్లో అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదుతో ఆదర్శంగా నిలుస్తోంది. కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలో 130 వ్యవసాయ కుటుంబాలు ఉంటాయి. ఏ ఎన్నికలు వచ్చినా ఓటు నమోదు మండలంలో ఎక్కువగా నమోదు అవుతుంది. 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 87 శాతం ఓటింగ్ నమోదు అయింది. గత శాసనసభ ఎన్నికల్లో 89 శాతం ఓటు నమోదు కాగా మండలంలో ప్రథమంగా నిలిచింది. అంతేకాకుండా సర్పంచ్ ఎన్నికల్లో 95 ప్రాదేశిక ఎన్నికల్లో 91 ఓటు శాతం ఓటింగ్ జరిగి మండలంలో ప్రథమంగా నిలిచింది.

వేములవాడ ఆలయంలో డ్యూటీ ఒకరిది.. పనిచేసే వారు మరొకరు

- దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు

వేములవాడ టౌన్, మే 15 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయ గర్భగుడిలో లింగం వాచర్లుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులు వారికి బదులుగా ప్రతి నిత్యం వేరే ప్రైవేటు వ్యక్తులను విధు లకు పంపిస్తున్నారని వారిపైన విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు పట్టణానికి చెందిన కనికరపు తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయం లో వాచర్లుగా విధులు నిర్వర్తిస్తున్న గోపి, సంతోష్ అనే వ్యక్తులు ప్రతి నిత్యం గర్భగుడిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే వారికి బధులుగా ప్రతి నిత్యం ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తూ వారు వేతనం పొందుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్‌ను ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలలో తరలి వెళుతున్న మహిళలు

చందుర్తి, మే 15 : చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గ్రామ దేవత పోచమ్మకు బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనం ఎత్తుకొని ఆలయానికి డప్పులతో తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యా సాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు ఊరేగింపు నిర్వహించారు. గ్రా మస్తులంతా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని బోనాల నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. వివిధ కుల సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

- కోనరావుపేట: చల్లంగా చూడు పోచమ్మ తల్లి అంటూ మామిడిపల్లి గ్రామ స్థులు పోచమ్మ బోనాల పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మం డలంలోని మామిడిపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను జరుపుకొని బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి వెళ్లి నైవేద్యం చెల్లించి పాడి పంటలు, కుటుంబ సభ్యులు బాగుండాలని మొక్కులు చెల్లించుకున్నారు. మామిడిపల్లి గ్రామంలో బుధవారం వరాల పోచమ్మ తల్లి బోనాల పండుగ సంద ర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, లింగారెడ్డి, కొక్కుల రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే డెంగ్యూ నివారణ

నేడు జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం



జగిత్యాల ప్రభుత్వ వైద్యశాల

జగిత్యాల టౌన్, మే 15: డెంగ్యూ జ్వరం మహా డేంజరెస్‌గా మారింది. అంటు వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైన వ్యాధి డెంగ్యూ అని వైద్యులు పేర్కొం టున్నారు. వర్షాలు పడడం ప్రారంభంతోనే ఈ వ్యాధి విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నివారణ మార్గాలే ఉత్తమమని వైద్యులు పేర్కొంటున్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

● డెంగ్యూ వాధి లక్షణాలు..

డెంగ్యూ వ్యాధి సోకిన వారికి ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా రావడం తీవ్రమైన తలనొప్పి, కంటి నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు ఇలా ప్రధాన లక్షణాలలతో డెంగ్యూ వాధి సోకుతుంది. అంతే కాకుండా వాంతులు అవుతున్నట్లు అనిపించడం, శరీరంపై దుద్దర్లు రావడం, ఆకలి మందగించడం, డీహైడ్రేషన్‌కు గురి కావడం వంటి లక్షణాలు ఉన్నట్లు కనిపిస్తే తక్షణమే ఆసుపత్రికి వెళ్లాలి.

● వ్యాపించే విధానం...

ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు వల్ల ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఫ్లైవీ అనే సూక్ష్మజీవి వైరస్ ద్వారా ఇది ఎక్కువగా వ్యాపిస్తుంది. ఏడిస్ ఈజిప్ట్ అనే దోమలు పగటి పూట సంచరిస్తూ కుడుతుంటాయి. చికున్ గున్యా కంటే ఎక్కువగా ఒంట్లో శక్తిని హరించే వ్యాధి డెంగ్యూగా చెప్పవచ్చు. ఈ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉండే పీహెచ్‌సీలతో పాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన పరీక్షలు చేయిం చుకోవాల్సిన అవసరం ఉంది.

● దోమల నివారణే ఉత్తమం..

డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన బాధ్యత వహించాలి, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో నీరు నిలువకుండా చూసుకోవాలి, వారంలో ఒక రోజు నీటి నిలువలు తీసివేసి ఆరబెట్టి పరిసరాలను శుభ్రపరచాలి. నీరు నిలువ ఉండడంతో దోమలు ఎక్కువగా వృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. నీరు ఎక్కువగా నిలిచే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమలు వృద్ధి చెందకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

● నివారణ మార్గాలు ఇవే...

ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటిలోకి దోమలు రాకుండా కటికీలతో పాటు తలుపులకు దోమ తెరలు బిగించుకోవాలి. చీకటి పడకముందే తలుపులు, కిటికీలు మూసివేయాలి. రాత్రి పడుకునే సమయంలో దోమ తెరలు ఉపయోగించాలి.

● జాగ్రత్తలు పాటించాలి.

శ్రీధర్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, జగిత్యాల జిల్లా



దోమల నిర్మూలన అందరి బాధ్యత. ప్రతి మంగళ, శుక్ర వారాలు డ్రై డేగా పాటించాలి. ముఖ్యంగా దోమలు కుట్టకుండా చూసుకోవాలి. డెంగ్యూ నివారణకు ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుంది. దోమలు వృద్ధి చెందకుండా చూడాలి. ఇంటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.